# నిర్ణయం

శ్రీమతి ఆర్. వసుంధర

'రామయ్యన్నా' అని చిన్నగా పిలిచి తలుపు చప్పుడు చేసేడు కృష్ణమూర్తి. ఎవరూ వచ్చి తలుపు తీయలేదు. వినపడలేదేమోనని మరి కొంచెం పెద్దగా తలుపు తట్టేడు.

ఎక్కడో లోపల వసారాలోంచీ 'భానూ, భానూ...ఆ బాసిగాడో ఎవడో వచ్చినట్టున్నాడు, తలుపు తియ్.. ఇంతలోనే వెయ్యకపోతే ఏం?' అంటూ కేక లేశాడు రామనాథం విసుగ్గా.

'ఎవరో నేను వెళ్ళిచూస్తాను...మీరు ఖంగారు పడకుండా పడుకోండి...ఈ పల్లెకొంపకి వచ్చినప్పటి నుంచీ తలుపులు వెయ్యనూ తియ్యనూ సరిపోతోంది... ఏం గోలో, ఏమో! యిక్కడి మనుష్యులకి ఒక ప్రైవసీ ఏవీ వుండదు' అని మాట్లాడుకుంటూనే వచ్చి తలుపుతీసింది.

వచ్చిన మనిషిని చూసి ఒక క్షణం మాట్లాడకుండా నిలబడిపోయింది. ముఖం విసుగుతో ముడుచుకుపోయింది. లేని నవ్వు తెచ్చిపెట్టుకుంటూ 'రా, లోపలికి' అన్నది.

కృష్ణమూర్తి లోపికివచ్చి బురద పేరుకుపోయిన చెప్పులు తలుపువారగా విడిచి నిలుచున్నాడు. భానుమతమ్మ బావిప్రక్కగా చూసి 'బాసిగాడు గొడ్లు తోలుకుపోయాడు...ఇంట్లోంచి కాళ్ళు కడుక్కోవానికి నీళ్ళు తెచ్చిస్తానుండు...'అన్నది కటువుగా. కృష్ణమూర్తి కాస్త ఖంగారుగా 'ఎందుకమ్మా, చెంద్రమ్మొదినా, నేను బావిలోంచి తోడుకొని కడుక్కుంటాగా...నీకెందుకూ శ్రమ' అంటూనే బావి దగ్గరకు వెళ్ళిపోయాడు.

కిష్టయ్యని చూస్తే అందుకే భానుమతమ్మకి మంట. ఏకాలంనాడో ఒదిలేసిన పేరుతో 'చెంద్రమ్మొదినా' అంటాడు. అలా అనటంలో కిష్టయ్య మడ్డితనమేకాకుండా తనను కించపరచాలనే భావం కూడా వున్నదని ఆమె అనుమానం. పెళ్ళవగానే చంద్రమ్మ అనే పేరు బాగాలేదని భానుమతిగా మార్చుకున్న విషయం అందరికీ తెలుసు! మరి యీ కిష్టయ్యమాత్రం పాతపేరును వదలలేదు.

'ఈ పల్లెటూరి మరియాదలతో నాకు చచ్చే చావుగా వుందనుకో కిష్టయ్యా...ఒక్కొక్కరూ వేళాపాళా లేకుండా పరామర్శకు వస్తుంటే వాళ్ళకు కాళ్ళకు నీళ్ళదగ్గర్నుంచీ కాఫీ ఫలహారాలూ, భోజనాలవరకూ అమర్చాలాయెను. లేకుంటే ఫలానావిడ మనుషుల్ని పలకరించదని చుట్టుప్రక్కల వాళ్ళు మొత్తం గుప్పుమని పోతాయాయెను... ఆయనకు యీ విషయం పట్టింపుగా వుంది, నాకేమో చావుగా వుంది...' అన్నది. కృష్ణమూర్తికి తగలాలనే అన్నది. కాని కిష్టయ్య పట్టించుకోకుండా బక్కెట్లో తోడిననీళ్ళు ధారాళంగా కాళ్ళమీదకు ఒంచుకుంటూ బురద కడుగుతూనే 'మీకేమో అలవాటు లేదాయెను...ఈ పల్లెటూళ్ళల్లో యింతేనమ్మా' అన్నాడు అనునయంగా.

భానుమతమ్మకు గడిచిన రోజులు జ్ఞప్తికివచ్చి కళ్ళల్లో నీళ్ళు తిరిగినై. తన భర్త రామనాథం మంచి పేరుగల గవర్నమెంటు డాక్టరుగావున్న రోజుల్లో నలుగురు పనివాళ్ళు యింట్లో నిండుగా తిరుగుతూ వునప్పుడు ఈ కిష్టయ్య తాము వుద్యోగరీత్యావున్న పట్టణాలకి నాలుగుసార్లు వచ్చాడు. 'వూరు చూడటానికి'. అంత హోదాగల యింట్లో తిరగటానికి, శుభ్రంగా యిస్త్రీ కవర్లు వేసిన సోఫా దిండ్లమీద

కూర్చోవడానికి సంకోచించి బయట అరుగులమీదనే యింటికొచ్చిన రోగుల్తో కబుర్లు చెబుతూ కాలం గడిపేవాడు...యిప్పుడు కొడుకు ఢిల్లీలోనూ కూతురు అమెరికాలోనూ వున్నారు; ఆయన రిటైరవగానే తామిద్దరూ యీ స్వగ్రామానికి రావలసి వచ్చింది. ఇక్కడుండే పల్లెటూరి మొద్దుల్ని, బంధువులనటానికి పనికిరాని వాళ్లని మనుష్యులుగా మన్నించవలసివస్తోంది. కిష్టయ్యకు స్వయంగా కాళ్లకు నీళ్లిచ్చి మర్యాద చెయ్యవలసిన పరిస్థితి ఏర్పడింది!

హైదరాబాదులో మంచి యిల్లొకటి తీసుకొని అక్కడికే తరలి వెళ్లిపోవాలని అనుకుంటుండగానే తెచ్చుకున్న సామాన్లు విప్పకుండానే ఎనభై ఏళ్ల ముసలి అత్తగారికి జబ్బుచేసి చావటం, మూడు నెల్లు తిరక్కుండానే ఆయనకు స్ట్రోక్ రావటం జరిగిపోయింది. మనశ్శాంతివుంటే ప్రాణభయం లేదన్నాడు గుంటూరులో డాక్టరు. 'ఇహ ఎన్నాళ్లకో హైద్రాబాదు వెళ్లేది!—' అని నిట్టూర్చుతూ లోనికి వెళ్లింది భానుమతమ్మ—కృష్ణమూర్తి కోసం తవ్వెడు బియ్యమూ గిద్దెడు పప్పూ వుడకబెట్టడానికి.

ముందు గదిలో పాతకాలపు పెద్దపట్టెమంచం మీద నాలుగంగుళాల మందపు పరుపుమీద పడుకుని వున్నాడు రామనాథయ్య. పై పంచెతో ముఖం తుడుచుకుంటూవచ్చిన కృష్ణమూర్తిని చూసి చిన్నగా నవ్వి 'కూర్చో' అన్నాడు.

దూరంగావున్న గిలకల కుర్చీని మంచం దగ్గరగా లాగి పై పంచెతో దులిపి కూర్చున్నాడు కిష్టయ్య. 'ఒంట్లో ఎట్లా వుంది?' అన్నాడు. 'గుంటూరులో డాక్టర్లు మనశ్శాంతి వుండాలన్నారంటగదా...ఇంతకీ నీ కొచ్చిన కష్టమేమిటో...' అంటూ పెత్తండ్రి కొడుకు రామనాథయ్య మొహంలోనికి పరిశీలనగా చూశాడు. సమాధానమేమీ రాకపోయేసరికి 'ఎప్పుడూ నలుగురు పెద్దమనుషుల్లో పేరుగా పట్టణాల్లో తిరుగుతుండేవాడివి, యీ పల్లెటూళ్లో ప్రొద్దుపోవటంలేదేమో...పోనీ అబ్బాయి దగ్గరకెళ్లి నాలుగునాళ్లు వుండిరారాదా...ఈ వూళ్లోకొచ్చి ఏడాది కావస్తోంది, బయట కాలుపెట్టకపోతివి...' అన్నాడు సానుభూతితో.

తమ్ముడి మాటలు విన్న రామనాథయ్యకు ఎక్కడో దూరంలోవుండి అదృశ్యమైపోతున్నట్లున్న పాత రోజులు జ్ఞాపకంవచ్చి సంతోషం కలిగింది. ఏడాది నుంచీ తానూ యీ పల్లెటూరి రైతుల్లో ఒకడై అనామకుడై పోయినట్లుగా కించపడ్డాడు. కిష్టయ్య రాకతో తాను మళ్లీ ఒక హోదాగల డాక్టరైనట్లు అనుభూతి కలిగింది. 'కాస్త ఆరోగ్యం కుదుటపడగానే హైదరాబాదుకు వెళ్లిపోవాలనుకుంటున్నానురా కిష్టాయ్. నా స్నేహితులు చాలమంది అక్కడే వున్నారు...యిప్పట్లో అబ్బాయిదగ్గరికి వెళ్లటానికి వీలుకాదులే...ఆరోగ్యం చూసుకోవద్దూ' అన్నాడు.

కిష్టయ్యకు ఒంటరిగాడైన అన్నమీద సానుభూతి ముంచుకొచ్చింది. 'ఏవిటోలే అన్నా... అందరూ చదువులు చదువులని ఎగబడ్డమేగాని ఆఖరికి చూస్తే కష్టానికీ సుఖానికీ దగ్గరలేకుండా ఆ పిల్లలెక్కడో మనమెక్కడో!...' అంటూ పుగాకుపాయ తీశాడు. దాన్ని చదునుచేసి నిలువుగా రెండు సగాలుగా చీల్చాడు. ఒక సగం చక్కగా సాఫీ చేసి కాలిమీద పెట్టుకున్నాడు. రెండోసగం సమమైన పొడవులో ముక్కలుగా తుంచి, ఆ ముక్కలన్నీ సాఫీచేసిన పాయలో పెట్టుకొని తాపీగా చక్కగా చుట్టచుట్టాడు.

ఈ ప్రయత్నమంతా కించిత్ తిరస్కారంగా చూస్తూ 'చదువుల సంగతి వీడికేం తెలుసు!' అనుకున్నాడు రామనాథయ్య. కిశోర్ ఢిల్లీలో వెయ్యిరూపాయిల జీతంతో మంచి వుద్యోగంలో వున్నాడు. శాంతి అమెరికాలో భర్తతోపాటుగా వుద్యోగంచేస్తూ నెలకు ఆరువేలు తెచ్చుకుంటున్నది. ఆ డబ్బూ సుఖమూ గొప్పదనమూ లక్షలో ఒకరికే, అదృష్టవంతులకి దక్కేవి. ఇప్పుడుదగ్గరలేకున్నా, ఎక్కడోవున్న వాళ్లిద్దరూ తన రెండు కళ్లు; ఆశాజ్యోతులు! తన ఆశలన్నీ వాళ్లలో రూపొందుతూంటే తాను పొందుతున్న ఆనందం పిచ్చి కిష్టాయ్ కేం తెలుస్తుంది!

కిష్టయ్య చుట్టచేతిలో పట్టుకొని గుండ్రంగా త్రిప్పి చూసుకుంటూ 'అసలు నేనొకమాట చెప్పా

లనే వచ్చాననుకో...అహ, నీకు తెలియదని కాదులే... అయినా...' అంటూ సాగదీశాడు.

రామనాథయ్య నవ్వుతూ 'అంత సందేహిస్తా వేమిట్రా. చెప్పు' అన్నాడు.

కిష్టయ్య కొంచెం ఆలోచించి 'అందరూ నానా రకాలుగా మాట్లాడుతారు...అవన్నీ నీవు మనసులో పెట్టుకోవద్దు...పెద్ది సంగతిగాని, నీ జబ్బు సంగతి గాని ఎవరైనా ఏమైనా చెవిలోవేస్తే పట్టించుకోబోక. ఇక్కడ తలకో వెర్రి మొర్రి ఆలోచన. ఇవన్నీ యిక్కడ మామూలేలే'...అన్నాడు.

రామనాథయ్యకు వూళ్లో వాళ్లు అనుకుంటు న్నారని బాసిగాడు చెప్పిన విషయం జ్ఞాపకం వచ్చింది. ఎనభై ఏళ్ళు బ్రతికి చచ్చిపోయిన తల్లి ఏకైక పుత్రుడైన తనమీద ఆశ చావని దయ్యమై పట్టిందనీ, అదే యీ జబ్బుకు కారణమనీ అనుకుంటున్నారట! 'ఇంత చదువుకున్న వాడిని...అందులో డాక్టర్ని...నీవు చెప్పక పోతే తెలియదనుకున్నావా?' అన్నాడు. నవ్వుతూ తేల్చే ద్దామని ప్రయత్నించినా గొంతులో విసుగు వ్యక్త మైంది.

భానుమతమ్మ వచ్చింది. 'అన్నానికి లే' అన్నది కిష్టయ్యతో. ఇప్పుడెందుకు చేశావమ్మా...ఇంటి దగ్గర చద్దిఅన్నం తినే వచ్చాను' అన్నాడు. 'ఎండన బడి నాలుగుమైళ్లు మీ వూరినుండి నడిచే ఒచ్చా వుగా, లే' అన్నదామె. పైపంచె కుర్చీలోవేసి లేచి వెళ్లాడు కిష్టయ్య.

* *

రామనాథయ్యకు ఒళ్లంతా పీకుతున్నట్లు తిమ్మిరిగా అనిపించింది. దిండ్లు సర్దుకొని కళ్లు మూసుకొని పడుకున్నాడు. తనకు ఆరోగ్యం సరిగా లేనప్పుడైనా పిల్లలు వచ్చే పరిస్థితి లేనందుకు కించిత్‌బాధ కలిగింది. పల్లెటూరి అమాయకుడైనా కిష్టయ్య అన్న మాటల్లో కొంచెం సత్యం వుందేమో అనిపించింది. సత్యంతో సంబంధం లేని ఆశల్లాగా ఎక్కడో దూరాన ఆ పిల్లలు! అను కున్నాడు.

ముసలితల్లి మంచంలో వున్నప్పటి మూలుగు చెవుల్లో హోరెత్తుతోంది. కిష్టయ్య మాటలు జ్ఞాపకం వచ్చాయి. దయ్యం, దయ్యం! దయ్యమంటే ఏమిటి? చచ్చిపోకముందు అమ్మపడిన బాధ, అప్పటి ఆవిడ మూలుగూ ఆరునెల్లయ్యాక యిప్పుడూ మనసును వికలం చేస్తోందంటే, అది దయ్యం కాదా? దీని కంతటికీ కారణమైనది...కారణం... అబ్బ! అంటూ నుదుటనిండిన స్వేదబిందువుల్ని వేలితో పోగుచేసి క్రిందకు విసిరేశాడు. ప్రక్క నున్న టవలుతో ముఖం, మెడా తడిలేకుండా తుడుచు కున్నాడు. ఓ ప్రక్కనుండీ తుడుస్తూ వుండగానే మళ్లీ చెమట చిన్నచుక్కలుగా ఏర్పడుతోంది. గుండె దడ దడ లాడుతున్నట్లుగా వేగం హెచ్చించుకున్నది. 'జబ్బు అనేది రాకూడదుగాని వచ్చిందంటే అన్నీ బాధలే' అనుకున్నాడు డాక్టర్ రామనాథం నిస్సహాయంగా...

ఆమె, అమ్మ, ఎనభై ఏళ్ల వయసులోకూడా, వేదనాభరితమైన అంత్యసమయంలోకూడా స్వతఃసిద్ధ మైన శీవిని పోగొట్టుకోలేదు. దువ్వి ముడివేసిన తెల్లనైలాన్‌దారాల్లాంటిజుట్టు, విశాలమైన నుదురు, ముసలితనంలో మరింత స్ఫుటంగా కన్పిస్తున్న కోటేరులాంటి ముక్కు, వయస్సులో తెల్లపొరలు క్రమ్మటంవలన ఎదుటివాళ్ల మనసుల్లో మరింత జంకు గలిగించే పెద్దకళ్లు—ముసలితనంలో ఆమె శక్తి ఏమాత్రం తగ్గలేదు! తాను గుర్తెరిగినప్పటి నుండీ ఆ కంచుగంటలాంటి అధికారపూర్వకమైన స్వరమూ, మనసు లోతుల్లోకి చూసే నిశితమైన చూపూ, నిర్లక్ష్యాన్ని సహింపలేని మానసిక తీవ్రతా- అన్నీ తన మనసులో తిరుగులేనివిగా మాయని ముద్రగా నిలిచిపోయాయి. తనఎడల ఆమె ప్రేమనే చూపినా ఎందుకో తాను సహజంగా ఆమె దగ్గరకు వెళ్లలేక పోయాడు. ఆ ప్రేమ మానసికమైనది, హృదయం నుండి వచ్చేదికాదు; అందుచేతే దూరంలో నిలబెట్టి వుంచేది!

ఆపరేషన్‌కు అనువుకాని వయసులో, నోటిలో కాన్సర్‌వచ్చి బాధతో వుండచుట్టుకొనిపోతూ, జంతువు లాగా అమానుషమైన గొంతుతో మూలుగుతూ వున్నప్పుడూ ఆమె బలహీనురాలైన ముసలి మనిషి లాగా కన్పించలేదు! మూడుసార్లు 'నాయనా, నీవు

డాక్టరువి, నా బాధ అంతంచేసి మాతృఋణం తీర్చుకోరా' అన్నది—కాదు, ఆజ్ఞాపించింది. మొదట తానా మాటలు పట్టించుకోలేదు. డాక్టరుగా తాను ఎన్ని రూపాల్లో ఎంతబాధను చూడలేదు గనుక! కాని... అనంతమైన శక్తికి, శీవికి మూర్తిగా జ్ఞానంరావి పసితనంనుంఢీ తన మనసులో నిలిచివున్న అమ్మ యిప్పుడు యింత ఘోరంగా మూలగటం, బాధ పడటం, తన మనసులో ఒక అసామాన్య స్థితిని తెచ్చిపెట్టింది...మార్ఫియా మత్తులోవున్న కొద్దిసమయం తప్పించి రాత్రింబవళ్ళూ, నెలరోజులు...నెలరోజులు! 720 గంటలు...43,200 నిమిషాలు...ఇరవై ఆరు లక్షల సెకండ్లకాలం నిర్విరామంగా ఆ అమానుషమైన మూలుగును భరించాడు, అనుభవించాడు! పిచ్చెక్కిపోతోందేమో అనిపించింది...ఆమె యింత అర్థంలేనిబాధను అనుభవించటం అసంగతంగా తోచింది.

'ఎట్లాగూ పోయే ముసలావిడ ఆ ప్రకారం బాధపడుతూవుంటే చూస్తూ వూరుకుంటారా! ఏమైనా చెయ్యకూడదూ...అంతగా అడుగుతోంది మరి...' అన్నది భానుమతి. సాభిప్రాయంగాచూస్తూ, అర్థం కానట్లు చూస్తూ వుండిపోయాడు తాను. తరువాత క్రమంగా ఆ వుద్దేశ్యం బలపడి, నాలుగోసారి అమ్మ కోరినప్పుడు ఒణుకుతున్న చేతులో యిచ్చాడు ఆమె మొయ్యలేని మార్ఫియా ఇంజక్షను.

వున్నట్లుండి, తీవ్రమైన రెండు ఎండ తెరల మధ్యన ఉబ్బవేస్తూవుండే వాతావరణంలోని అసహజ ప్రశాంతత లాంటిది ఏర్పడింది. బాహ్యప్రపంచంనుంచీ మూలుగు అస్తమించింది.

ఒక ప్రాణాన్ని అంతం చెయ్యడానికి మరో మనిషికి హక్కు వున్నదా? అంత అనాలోచితంగా ఆవిణ్ణి ఎట్లా చంపగలిగాడు తాను! ఒక హంతకుడికీ తనకూ భేదం ఏమిటి? ఆ మూలుగు తనలో కల్గించిన మానసిక వైకల్యాన్నుండీ తప్పించుకోవడానికే అట్లా చేశాడా తాను?

హార్దికమైన ప్రేమను అందించని తల్లిని చంపాడా తాను?

ఒక అనిశ్చిత మానసికస్థితిలో భార్య చెప్పిన పనిని చేశాడా తాను?

భాను తననుగురించి ఏమనుకుంటోంది?

ఏం జరిగింది? ఈ నిర్ణయం ఎందువలన జరిగింది? ?

ప్రతి విషయాన్నీ పూర్తిగా భిన్నమైన రెండు కోణాల్లోంచీ చూడవచ్చును. అట్లాంటప్పుడు 'సరియైన నిర్ణయం' అనేది ఏది? ఎట్లా తెలుసుకోవటం? అయోమయంలో పడిపోయాడు రామనాధయ్య.

క్రమంగా బాహ్యప్రపంచంలోంచీ అంతరింపజేసిన ఆ మూలుగు మనసులో నిండిపోయింది......

భోజనం చేసివచ్చాడు కిష్టయ్య, తృప్తిగా త్రేనుస్తూ. 'అరె, చెమట కారిపోతోందే' అంటూ ప్రక్కనున్న విసనకర్రతో విసరటం ప్రారంభించాడు. రామనాధయ్యకు చల్లటిగాలి తగలటంతో కాస్త తేరుకున్నట్లనిపించింది.

'బోలెడన్ని తత్వాలు పాడతావు, వేదాంత చర్చలు చేస్తావు...కిష్టయ్యా, మనిషి తీసుకునే నిర్ణయానికి సబబు ఎట్లాంటిదో చెప్పు, చూద్దాం...' అన్నాడు రామనాధయ్య సగం నవ్వుతాలుగా ధ్వనింపజేస్తూ.

చొక్కాజేబులోంచీ యిందాక చుట్టిన చుట్టబయటికితీశాడు కిష్టయ్య. రెండు అగ్గిపుల్లల సహాయంతో ముట్టించాడు. అన్నను పరిశీలనగా చూసి 'అదేమిటన్నాయ్, వేదాంతంవిూద దృష్టి మళ్ళింది!... నవ్వుతాలుకా?...నిర్ణయాలు తీసుకోవడానికి మనమెంతటివాళ్ళం గనక! అంతా వాడి లీల!' అన్నాడు.

మెట్టవేదాంతం. కిష్టయ్య కింకేం తెలుస్తుంది ఇంతకంటే! అనుకున్నాడు రామనాధయ్య. నవ్వు వచ్చింది. 'అయితే ఏంచేసినా ఫరవాలేదంటావ్!' అన్నాడు.

కిష్టయ్య కాస్త ఆలోచనలో పడ్డాడు. 'మనస్ఫూర్తిగా చేస్తేసరి. ఒకళ్ళకి బాధ కలిగించకుండా...' అంటూ ఆగి 'యివాళ నన్ను బాగా ఆట పట్టించాలనుకున్నావ్!' అన్నాడు.

భానుమతమ్మ వచ్చింది. 'కిష్టయ్యా, ఆచుట్టపొగ ఇంజన్‌లాగా ఒదులుతున్నావ్' అన్నది నొసలు చిట్లిస్తూ.

కిష్టయ్య చుట్టచివర్ని నేలమీాదరుద్ది, ఆర్పి జేబులో వేసుకున్నాడు నవ్వుకుంటూ. 'ఆయన కసలే మనసు బాగుండలేదు..మీ పెద్ది నెలరోజులు గోండ్రించి చెవులు హోరెత్తించింది. అదే మనసు పాడుచేసిందని అంటు న్నారు...ఇహ నీ వేదాంతం కాస్త జోడించావంటే బాగానే వుంటుంది' అన్నది.

'అ, కాస్సేపు వుబుసుపోక...' అన్నాడు రామ నాథయ్య. 'చేసేదంతా భగవంతుడే నన్నావ్; అంతలోనే మనస్ఫూర్తిగా యితరులకి బాధ కలిగించకుండా చెయ్యాలంటున్నావ్. మరి అన్నీ నడిపిస్తుండేది నీవా, భగవంతుడా?' అనడిగాడు కొంచెం వుత్సాహంగా, కిష్టయ్యను బోల్తా కొట్టించానన్నట్లు.

'అంతా వాడే చేయించేది. మనం చేస్తున్నా మని అనుకొని 'సబబులకోసం చూడబోతాం, తాప త్రయపడతాం. చేయించేది వాడేనని తెలుసుకుంటే బాధేవుండదు...' అన్నాడు కిష్టయ్య, వెనక ఎప్పుడో ఒక స్వాములవారు చెప్పిన విషయం జ్ఞాపకం చేసు కొంటూ.

రామనాథయ్య నవ్వేశాడు. 'చాలా అద్వైతంగా వుండే వ్యవహారం...యిదంతా కనిపెట్టిన వాళ్లెవరో గాని మొత్తానికి పని చాలా సులువు చేసేశారు... మేము అట్లాగ కాదు. చేసిన పనికంతా బాధ్యత వహిస్తాం, యింకోళ్లమీాద తోసెయ్యం, అదీగాకుండా నా యాభై ఆరేళ్ల జీవితంలోనూ నీవు వున్నావని చెబుతున్న భగవంతుడు నాకు ఎప్పుడూ కన్పించలేదు' అన్నాడు.

అంతలోనే ఒళ్లంతా లాగేస్తున్నట్లు గుండె పిండేస్తున్నట్లు బాధ కలిగింది. 'పిల్లలు, పిల్లలు' అనుకున్నాడు ఆదుర్దాగా, అస్పష్టంగా మనసు లోతు ల్లోకి దూసుకుపోయిన ఆలోచనలో. 'వాళ్లు రాలేరు రారు' అనుకున్నాడు. మనసులో నిస్పృహ నిండి పోయింది. 'అబ్బ, నొప్పి, నొప్పి...' అంటూ వుండ చుట్టుకు పోయాడు.

'ఎక్కడ, ఎక్కడ...' అంటూ ఖంగారు పడ్డాడు కిష్టయ్య.

'త్వరగావెళ్లి డాక్టరును పిల్చుకురా...అల్లా నిల్చున్నావే' అంటూ భర్త దగ్గరకి పరుగెత్తుకు వచ్చింది భానుమతమ్మ. చేతులూ కాళ్లూ బారచాపు కొని నిటారుగా పడుకుండిపోయాడు రామనాథయ్య నిలువు గుడ్లతో చూస్తూ. కిష్టయ్య గాభరాగా డాక్టరు కోసం పరుగెత్తాడు......

*　　*　　*

శిలాప్రతిమలా కూర్చుండిపోయింది భాను మతమ్మ, అనుకోని పరిణామానికి తట్టుకోలేక. ఢిల్లీలోవున్న కొడుకూ, అమెరికాలోవున్న కూతురూ, హైదరాబాదులో గడపవలసిన జీవితం, హోదా, వ్వదనం—అన్నీ గాలిలో దూదిపింజల్లాగ అంద కుండా ఎగిరిపోగా ముక్కలైపోయిన మనసు ఊా పనికిరాని 'పల్లెటూరు, కిష్టయ్యా, నిస్సహాయత, ఒంటరితనం అన్న కఠిన సత్యాన్ని ఎదుర్కోలేక దీనంగా ఏడ్చింది......

ఢిల్లీనుండి కొడుకు రావటానికి రెండు రోజు లైనా పడుతుంది గనుక, ఎండాకాలం శవాన్ని నిల పటం కష్టం గనుక, ఐస్‌లోపెట్టినా వికృతమై పోతుందిగనుక, కృష్ణమూర్తి అన్నశవానికి అంత్య క్రియలు నిర్వర్తించాడు. 'ఈ పని చెయ్యటానికే నన్ను యిప్పుడు యిక్కడికి రప్పించావా స్వామీ!' అను కున్నాడు కళ్లు వొత్తుకుంటూ.........